# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

## ప్రాంతీయ వార్తా విభాగం

## ప్రాంతీయ వార్తలు

**తేది : 08-08-2024** **సమయం : 6.45 గంటలు**

# ముఖ్యాంశాలు

1. **భూహక్కు సర్వే పత్రాల స్థానంలో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ అధికారిక రాజముద్ర, క్యూఆర్ కోడ్‌తో కూడిన కొత్త పట్టాదారు పాసుపుస్తకాలు అందజేయాలని రాష్ట్ర మంత్రివర్గం నిర్ణయించింది.**
2. **గ్రామ పంచాయతీ స్థాయిలో ప్రజల్లో వాతావరణ మార్పులపై అవగాహన కల్పించాలని ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి కె పవన్ కల్యాణ్ అధికారులకు సూచించారు.**
3. **ఆంధ్రప్రదేశ్ లో కృత్రిమ మేధ-ఏఐ విశ్వవిద్యాలయాన్ని ఏర్పాటు చేయనున్నట్లు రాష్ట్ర విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ ప్రకటించారు.**
4. **తెలంగాణలోని రిజర్వాయర్ల స్థితిగతులను పరిశీలించేందుకు రాష్ట్ర మంత్రివర్గ ఉప సంఘాన్ని ఏర్పాటు చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది.**
5. **దేశవ్యాప్తంగా అన్ని ప్రాంతాల్లో 10 రూపాయల నాణేలు చెల్లుబాటు అవుతాయని రిజర్వు బ్యాంక్ ఆఫ్ ఇండియా ప్రతినిధులు స్పష్టం చేశారు.**
6. **ఉభయ తెలుగు రాష్ట్రాల్లో రాబోయే రెండు రోజుల్లో తేలికపాటి నుంచి ఓ మోస్తరు వర్షాలు కురుస్తాయని భారత వాతావరణ శాఖ పేర్కొంది.**

============================

భూ హక్కు సర్వే పత్రాల స్థానంలో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ అధికారిక రాజముద్ర, క్యూఆర్ కోడ్‌తో కూడిన కొత్త పట్టాదారు పాసుపుస్తకాలు అందజేయాలని రాష్ట్ర మంత్రివర్గం నిర్ణయించిందని రాష్ట్ర సమాచార, పౌరసంబంధాల శాఖ మంత్రి కొలుసు పార్థసారధి వెల్లడించారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధ్యక్షతన సచివాలయంలో నిన్న జరిగిన మంత్రివర్గ సమావేశంలో తీసుకున్న నిర్ణయాల్ని మంత్రి పాత్రికేయులకు వివరించారు. 22ఏ, ఎసైన్డ్ భూముల రిజిస్ట్రేషన్లన్నీ మూడు నెలలపాటు నిలిపేయాలని మంత్రివర్గం నిర్ణయించిందని తెలిపారు. విజయనగరం, మచిలీపట్నం, రాజమహేంద్రవరం, ఏలూరు, నంద్యాలల్లో నిర్మించిన నూతన వైద్యశాలల్లో అదనంగా 380 పోస్టుల భర్తీకి మంత్రివర్గం ఆమోదం తెలిపిందన్నారు. ఇద్దరి కంటే ఎక్కువ మంది పిల్లలుంటే మున్సిపల్, పంచాయతీరాజ్ ఎన్నికల్లో పోటీ చేసేందుకు అనర్హులుగా పరిగణిస్తూ ఆయా స్థానిక సంస్థల్లో సభ్యులుగా కొనసాగటాన్ని నిషేధించే చట్టసవరణల రద్దుకు ఆమోదం తెలిపిందని మంత్రి పేర్కొన్నారు.

---------------------------

గ్రామ పంచాయతీ స్థాయిలో ప్రజల్లో వాతావరణ మార్పులపై అవగాహన కల్పించాలని ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి కె.పవన్ కల్యాణ్ అధికారులకు సూచించారు. పర్యావరణ మార్పులపై రాష్ట్ర భవిష్యత్తు ప్రణాళిక–2030 తుది ముసాయిదాపై నిన్న ఉప ముఖ్యమంత్రి సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, వాతావరణ మార్పులపై డాక్యుమెంటరీలు రూపొందించడం, పోటీలు నిర్వహించడం లాంటి వినూత్న రీతిలో ప్రచారం కల్పించేలా ప్రణళికలు అమలు చేయాలని ఆదేశించారు. ప్రజలకు వాస్తవ గణాంకాల సమాచారాన్ని అందించేందుకు డ్యాష్ బోర్డు, మొబైల్ యాప్‌ను అభివృద్ధి చేయాలని సూచించారు.

---------------------------

ఆంధ్రప్రదేశ్‌లో కృత్రిమ మేధ–ఏఐ విశ్వవిద్యాలయాన్ని ఏర్పాటు చేయనున్నట్లు రాష్ట్ర విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ ప్రకటించారు. రాష్ట్రంలో ఉన్నత విద్య పనితీరు, ర్యాంకుల మెరుగుదల తదితర అంశాలపై నిన్న అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, రాష్ట్రాన్ని కృత్రిమ మేధకి కేంద్రంగా తీర్చిదిద్దాలన్నది ప్రభుత్వ లక్ష్యమని తెలిపారు. ఏఐ విశ్వవిద్యాలయాన్ని ఎక్కడ ఏర్పాటు చేయాలనే దానిపై అధ్యయనం చేయాలని, దీని ద్వారా విద్య, వైద్యం, సుపరిపాలన తదితర 16 రంగాల్లో సమర్థవంతమైన సేవలు అందించేందుకు వీలుంటుందని మంత్రి వెల్లడించారు.

---------------------------

తెలంగాణలోని రిజర్వాయర్ల నిల్వ, సామర్థ్యం, పునరుద్ధరణ తదితర అంశాలను పరిశీలించేందుకు రాష్ట్ర మంత్రివర్గ ఉపసంఘాన్ని ఏర్పాటు చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. కేంద్ర జలశక్తి మంత్రిత్వ శాఖ, జలవనరులు, నదుల అభివృద్ధి గంగా పునరుజ్జీవన శాఖ, జాతీయ ప్రాజెక్టుల నిర్వహణ పద్ధతులు, మార్గదర్శకాలను అధ్యయనం చేసి తగిన సూచనలు చేసేందుకు ఈ మంత్రివర్గ ఉపసంఘం పనిచేయనుందని ఉత్తర్వుల్లో తెలిపింది. ఈ కమిటీకి చైర్మన్‌గా తెలంగాణ నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి వ్యవహరించనున్నారు. సభ్యులుగా వ్యవసాయ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, ఎక్సైజ్ మంత్రి జూపల్లి కృష్ణారావులను నియమించినట్లు ప్రభుత్వం ఉత్తర్వుల్లో పేర్కొంది.

---------------------------

ఆంధ్రప్రదేశ్‌లో అక్టోబర్ 1వ తేదీ నుంచి నూతన మద్యం విధానాన్ని తీసుకొస్తున్నామని రాష్ట్ర ఎక్సైజ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర వెల్లడించారు. అమరావతిలోని రాష్ట్ర సచివాలయంలో మద్యం తయారు చేసే బహుళ వాణిజ్య సంస్థల ప్రతినిధులతో నిన్న సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లడుతూ, ఆంధ్రప్రదేశ్‌లో కల్తీ మద్యంపై చర్యలు తీసుకుంటున్నామన్నారు. వివిధ రాష్ట్రాల్లో అమలవుతున్న మద్యం విధానాలను అధ్యయనం చేసి సమగ్రమైన మద్యం విధానాన్ని తీసుకొస్తున్నామని మంత్రి తెలిపారు.

---------------------------

దేశవ్యాప్తంగా అన్ని ప్రాంతాల్లో 10 రూపాయల నాణేలు చెల్లుబాటు అవుతాయని రిజర్వు బ్యాంక్ ఆఫ్ ఇండియా –ఆర్‌బీఐ ప్రతినిధులు స్పష్టం చేశారు. విజయవాడలో హోంశాఖ ముఖ్యకార్యదర్శి కుమార్ విశ్వజిత్ అధ్యక్షతన 33వ రాష్ట్ర స్థాయి బ్యాంకుల భద్రతా సమావేశాన్ని నిన్న నిర్వహించారు. అసత్య ప్రచారం, వార్తలు కారణంగా తలెత్తిన అనుమానాలతోనే ప్రజలు నాణేలను తీసుకోవడానికి విముఖత చూపిస్తున్నట్లు తెలిపారు. 10 రూపాయల నాణేలపై ఉన్న అపోహలపై అవగాహన కల్పించేందుకు ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల రిటెయిల్ వ్యాపారులకు ఆ నాణేలను పంపిణీ చేశారు. నాణేలను 14 విభిన్న వివిధ ఆకారాల్లో తయారుచేశామని, ఆకారాలతో

సంబంధం లేకుండా అన్ని నాణేలు చట్టబద్ధమైనవేనని తెలిపారు. అన్ని శాఖలవారు నిస్సందేహంగా వినియోగించుకోవాలని ఆర్‌బీఐ ప్రతినిధులు సూచించారు.

---------------------------

ఆంధ్రప్రదేశ్ వ్యాప్తంగా రాబోయే రెండు  రోజుల్లో తేలికపాటి నుంచి ఓ మోస్తరు వర్షాలు కురుస్తాయని అమరావతి వాతావరణ కేంద్రం పేర్కొంది. పలు జిల్లాల్లో  కొన్నిచోట్ల భారీ వర్షాలు కురిసే అవకాశముందని తెలిపింది.  గంటకు 30 నుంచి 40 కిలోమీటర్ల వేగంతో గాలులు వీస్తాయని, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించింది.

తెలంగాణలో రానున్న రెండ్రోజుల పాటు భారీ వర్షాలు కురుస్తాయని హైదరాబాద్ వాతావరణ కేంద్రం వెల్లడించింది.  భద్రాద్రి కొత్తగూడెం, కామారెడ్డి, భూపాలపల్లి, హైదరాబాద్, మెదక్, రంగారెడ్డి, సంగారెడ్డి, సిద్దిపేట, సూర్యాపేట, హనుమకొండ జిల్లాల్లో  మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని పేర్కొంది. కరీంనగర్, ఖమ్మం, మల్కాజ్‌గిరి, ములుగు, నల్లగొండ, జనగామ, భువనగిరి, మహబూబాబాద్, వరంగల్ జిల్లాల్లో భారీ వర్షాలు కురుస్తాయని పేర్కొంది.

---------------------------

గర్భాశయ ముఖద్వార క్యాన్సర్‌పై అవగాహన కల్పించేందుకు ఆకాశవాణి విజయవాడ ప్రాంతీయ వార్తా విభాగం రూపొందించిన ప్రత్యేక కార్యక్రమం ఈరోజు   ఉదయం 10 గంటలకు ప్రసారమవుతుంది.

---------------------------

రాజ్యసభలోని 12 స్థానాల్లో ఉప ఎన్నికలకు కేంద్ర ఎన్నికల సంఘం షెడ్యూల్ విడుదల చేసింది. సార్వత్రిక ఎన్నికల్లో పలువురు లోక్‌సభ ఎంపీలుగా ఎన్నికవడం, రాజీనామాలతో ఈ ఖాళీలు ఏర్పడ్డాయి. తెలంగాణ సహా తొమ్మిది రాష్ట్రాలకు చెందిన రాజ్యసభ ఖాళీలకు సంబంధించి సెప్టెంబరు 3వ తేదీన ఎన్నికలు నిర్వహించేందుకు ఎన్నికల సంఘం షెడ్యూల్ విడుదల చేసింది. అదే రోజు సాయంత్రం ఓట్ల లెక్కింపు జరుగుతుందని తెలిపింది. ఎన్నికలకు సంబంధించి ఆగస్టు 14వ తేదీన నోటిఫికేషన్ విడుదల కానుండగా.. నామినేషన్లకు ఆగస్టు 21 చివరి తేదీ అని ఎన్నికల సంఘం వెల్లడించింది.

---------------------------

ప్యారిస్ ఒలింపిక్స్‌లో మహిళల 50 కిలోల విభాగంలో ఫైనల్‌కు చేరుకున్న  వినేశ్ ఫొగాట్ నిర్ణీత బరువు కంటే ఎక్కువ ఉండటంతో ఆమెను అనర్హురాలిగా  ఒలింపిక్ రెజ్లింగ్ కమిటీ ప్రకటించింది. 50 కిలోల విభాగంలో పోటీ పడేందుకు కావాల్సిన బరువు కంటే ఆమె 100 గ్రాములు అధికంగా ఉండటంతో ఈ నిర్ణయం తీసుకున్నట్లు వెల్లడించంది. అనర్హత వార్త అత్యంత బాధాకరమని ప్రధానమంత్రి నరేంద్రమోదీ సామాజిక మాధ్యమం వేదికగా స్పందించారు. వినేష్, దేశానికి గర్వకారణమని ప్రతి భారతీయునికి స్ఫూర్తి అని పేర్కొన్నారు. వినేశ్ ఫొగాట్‌కు భారత ప్రభుత్వం, దేశం అండగా ఉందని, ఆమెకు వైద్య, మానసికపరంగా అన్ని రకాల సాయాన్ని అందిస్తున్నామని భారత ఒలింపిక్ సంఘం –ఐఓఏ అధ్యక్షురాలు  పీటీ ఉష తెలిపారు.

---------------------------

చేనేత రంగ కార్మికుల సమస్యలను పరిష్కరించే విధంగా కృషి చేస్తున్నామని తెలంగాణ  వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్రావు అన్నారు. నిన్న హైదరాబాద్‌లో జాతీయ చేనేత దినోత్సవం సందర్భంగా చేనేత,

జౌళి శాఖల ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో మంత్రి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... చేనేత కార్మికుల బీమా కోసం 6 వేల కోట్ల రూపాయల చెక్కును ఎస్ఐసీ అధికారులకు అందిస్తున్నట్లుగా చెప్పారు. చేనేత కార్మికుల అభ్యున్నతిపై సమావేశం ఏర్పాటు చేస్తామన్నారు. రైతులకు అందించే సాయం మాదిరిగానే తెలంగాణ నేతన్నలకు సాయం చేసేలా ప్రభుత్వం ప్రణాళికల రూపొందిస్తుందని చెప్పారు.

---------------------------

భద్రతను పునరుద్ధరించాలని కోరుతూ వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు వైయస్ జగన్మోహన్ రెడ్డి వేసిన పిటిషన్‌పై నిన్న ఆంధ్రప్రదేశ్ ఉన్నత న్యాయస్థానంలో విచారణ జరిగింది. ఈ సందర్భంగా జగన్మోహన్ రెడ్డికి ప్రస్తుతం ఉన్న బుల్లెట్ ప్రూఫ్ వాహనం స్థానంలో కొత్త వాహనాన్ని కేటాయిస్తామని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం న్యాయస్థానానికి తెలిపింది. భద్రతా సిబ్బంది ఇచ్చే సమాచారం మేరకు జామర్ ఇస్తామని స్పష్టం చేసింది. దీనిపై కౌంటర్ వేయాలని ప్రభుత్వాన్ని ఆదేశించిన హైకోర్టు.. తదుపరి విచారణ మూడు వారాలకు వాయిదా వేసింది.

======================